క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న రామలింగేశ్వరరావు

ఇల్లెందు: విద్యార్థులు అజాగ్రత్త వల్ల సైబర్ నేరాలకు లోనయ్యే ప్రమాదం పొంచిఉందని, జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు తెలిపారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సైబర్ నేరాల తీరును వివరించారు. ఏఎస్ఐ రవి, ప్రోగ్రాం ఆఫీసర్ టి.జాన్, విలియం ప్రసాద్, వీరభద్రం పాల్గొన్నారు.

నర్సరీల ఆకస్మిక సందర్శన



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీఓ

జూలూరుపాడు: మాచినేనిపేటతండా, కొమ్ముగూడెం, జూలూరుపాడు గ్రామాల్లోని నర్సరీలను గురువారం భద్రాద్రి కొత్తగూడెం డీఆర్డీఓ మధుసూదన్‌రాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీల నిర్వాహణ పట్ల డీఆర్డీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీల్లో ప్రతి మొక్కను సంరక్షించాలి, మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జూలూరుపాడు, మాచినేనిపేటతండా పంచాయతీ సెక్రటరీలు సునీత, జ్యోతి, ఈజీఎస్ ఎఫ్ఏలు మూడ్ రమేష్, జగదీష్, హరికిషన్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దినేష్

టేకులపల్లి: టేకులపల్లి మండలం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజన్‌లో పిల్లలకు సోకే వ్యాధులు, చర్మ సంబంధితమైన అంటువ్యాధుల గురించి, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చైతన్య, స్టాఫ్ నర్స్ ప్రసన్న, రమేష్ బాబు, పరంగిణి పాల్గొన్నారు.

12న ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఈనెల 12న పాల్వంచలో జరగనున్న ఐఎఫ్‌టీయూ ఏడవ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి ఏదులాపురం గోపాల్‌రావు పిలుపునిచ్చారు. గురువారం గుండెపుడి గ్రామంలో జిల్లా మహాసభ వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. భవిష్యత్ కార్యాచరణపై జిల్లా మహాసభలో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సభకు వివిధ రంగాల్లో పని చేసే కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నరసింహారావు, కుంచం జమలయ్య, నాగరాజు, గోపి, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశానని, టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నానని దళితుణ్ని కావడం వల్లే ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం లేదా అంటూ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వేల్పుల నరసింహారావు వాపోయారు. గురువారం జూలూరుపాడులో స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2001 - 2014 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని నడిపించేందుకు ఎంతో కృషి చేశానన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పార్టీ పిలుపులో భాగంగా పల్లెబాట, విద్యుత్ ఉద్యమం, సకల జనుల సమ్మె సమయంలో ఎంతో కీలకంగా పని చేసినట్లు చెప్పారు. ఉద్యమ సమయంలో పలుమార్లు అరెస్టయ్యానని, పోలీసుల లాఠీదెబ్బలు తిన్నానని, సమైక్యాంధ్ర కార్యకర్తల దాడిలో తనతోపాటు, కార్యకర్తలు గాయపడినట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమం నడిపే క్రమంలో పీజీ చదువుకున్నప్పటికీ అన్ని విధాలుగా నష్టపోవడం జరిగిందన్నారు. ఆనాడు ఉద్యమం కోసం, నేడు పార్టీ కోసం పని చేస్తున్న తనకు సీఎం ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

రైటర్‌బస్తీలో సమస్యల తిష్ట

- చెత్తచెదారంతో డ్రెయినేజీలు దుర్గంధం
- కానరాని ఫాగింగ్
- అలంకారప్రాయంగా వీధి దీపాలు



చెత్తచెదారంతో రైటర్ బస్తీలోని ఓ వీధి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డు రైటర్‌బస్తీలో సమస్యలు తిష్ట వేశాయి. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తచెదారంతో దర్శనమిస్తున్నాయి. ఇళ్ల మధ్య ప్రమాదకరంగా పెద్దపెద్ద రెండు డ్రెయినేజీ కాలువలు ఉండటంతో ప్రజలు రాకపోకలకు భయపడుతున్నారు. పిల్లలు ఆడుకుంటూ అనుకోకుండా జారీ పడితే సుమారు ఐదు అడుగుల లోతులో ఉన్న మురుగులో పడి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు సమస్య చెప్పిన పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా రైటర్‌బస్తీలోని పాత కలెక్టరేట్ ఆఫీస్ సమీపంలోని వినాయక మండపం వద్ద ఇటీవల వేసిన రోడ్డు సైతం బీటలు వారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కొన్నిచోట్ల చెత్తచెదారాన్ని తొలగించకపోవడంతో మురుగు వెళ్లే డ్రెయినేజీలు సైతం చెత్తచెదారంతో నిండిపోతున్నాయని, పారిశుద్ధ్య పనులు అరకొరగా చేస్తుండటంతో చెత్త చెదారం పేరుకుపోయి దుర్గంధం భరించలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే వీధుల్లో వీధిదీపాలు సైతం వెలగడం లేదని, చీకట్లో స్థానికులు ఇబ్బంది పడుతున్నామని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

దోమలు బెడద విపరీతంగా ఉందని విష జ్వరాల బారీన పడాల్సి వస్తోందని, ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చెత్తచెదారంతో పాటు డ్రెయినేజీల్లోని మురుగునీటి తొలగింపజేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, వీధుల్లో వీధి దీపాలను వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పూడుకుపోయిన డ్రెయినేజీ

పారిశుద్ధ్య పనులు నిర్వహించాలి



మా వార్డులోని వీధుల్లో చేరిన చెత్తను తక్షణమే తొలగించాలి. దుర్గంధం భరించలేకపోతున్నం. డ్రెయినేజీల్లోని మురుగుతో దోమల బెడద ఎక్కువగా ఉంది. విష జ్వరాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కోరపాటి రాజేష్, రైటర్‌బస్తీ

ప్రమాదాల నుంచి రక్షించండి



అంతర్గత రహదారుల పక్కనే ఉన్న రెండు పెద్ద కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆదమరిస్తే ప్రమాదం సంభవిస్తుంది, అధికారులు స్పందించి ప్రజలకు రక్షణ కల్పించాలి. డ్రెయినేజీ కంపు కొడుతోంది. వీధుల్లో ఫాగింగ్ చేయాలి.

– జిల్లి శ్రీలక్ష్మి, 31వ వార్డు రైటర్‌బస్తీ

సమస్యలు పరిష్కరిస్తాం



రైటర్‌బస్తీ గొల్లగూడెంలోని వార్డు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రమాదకరంగా ఉన్న కాలువల వద్ద నిర్మాణాలు చేపట్టి రక్షణ కలిపిస్తాం. వీధుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తాం.

– జి.రవి, కమిషనర్, కొత్తగూడెం

బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేకే బీజేపీ కుట్రలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక బీజేపీ కుట్రలు చేస్తోందని.. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బలహీన పర్చాలని కవితకు ఈడీ నోటీసులు పంపుతోందని కేసీఆర్ కుటుంబం వెనుక తెలంగాణ సమాజం ఉందని... బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలను తిప్పి కొడతామని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తూ సొంత ప్రయోజనాలకు వాడుకుంటోందని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన కేసీఆర్ కుటుంబాన్ని అబాసుపాలు చేయాలనే సీఎంను టార్గెట్ చేసిందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బంది పెడితే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదన్నారు. కుట్రలు, కుతంత్రాలతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తోందని దుయ్యబట్టారు. ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ అధికారంలోకి రాలేదని పేర్కొన్నారు. దేశంలో ప్రతిపక్షం లేకుండా చేయాలన్నదే బీజేపీ ఆలోచనని ధ్వజమెత్తారు. బీజేపీ కక్షసాధింపు చర్యలపై బీఆర్ఎస్ దశలవారీగా ఆందోళనలు చేస్తుందని స్పష్టం చేశారు. చరిత్రలో నియంతలకే దిక్కులేదని, మోదీ ఎంతని ఎద్దేవా చేశారు. మహిళా దినోత్సవం రోజున ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడం మహిళలను కించపర్చడమేనన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, భూక్యా రాంబాబు, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, బాదావత్ శాంతి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ స్ఫూర్తిని కొనసాగించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి భానుమతి

కొత్తగూడెంఅర్బన్: మహిళా దినోత్సవ స్ఫూర్తిని నిత్యం కొనసాగించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. గురువారం పాతకొత్తగూడెం గౌతమ్‌నగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ ఫర్ ఉమెన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పురాణాలలో మహిళలకి విశిష్ట గౌరవం ఉందని, సృష్టికి మూలమని మహిళలు నేడు అన్ని రంగాలలో ఉన్నతంగా రాణిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మంచి నడవడికను అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాద్ రావు మాట్లాడుతూ.. మహిళలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలను అధిగమిస్తూ ముందడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, డిప్యూటీ కౌన్సిల్ నిరంజన్‌రావు, న్యాయవాదులు తోట మల్లేశ్వరరావు, మెండు రాజమల్లు, కాసాని రమేష్, ప్రిన్సిపల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్న పాలకులు



మాట్లాడుతున్న చందర్‌రావు

జూలూరుపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వల్లమల్ల చందర్‌రావు విమర్శించారు. గురువారం కాకర్ల గ్రామంలో జరిగిన డీవైఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ రాకముందు ప్రతి సంవత్సరం లక్ష ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దెనెక్కిన తరువాత విస్మరించిందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు చెందిన అంబానీ, అదానీలకు అప్పగించి వారిని మరింత సంపన్నులుగా మారుస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చీమలపాటి పృథ్వీ, చీమకుర్తి గణేష్, రమేష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపు ఏర్పాటు



గుండెపుడిలో చేతిపంపును ప్రారంభిస్తున్న సర్పంచ్ బానోత్ నరసింహారావు

జూలూరుపాడు: గుండెపుడి గ్రామంలో తాగునీటి అవసరాల కోసం గ్రామ సర్పంచ్ బానోత్ నరసింహారావు గురువారం చేతి పంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసింహారావు మాట్లాడుతూ.. ప్రజల కోరిక మేరకు మంచినీటి కోసం చేతి పంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు వైస్ ఎంపీపీ గాదె నిర్మల, ఉపసర్పంచ్ చిలుకూరి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు కాళ్లూరు వెంకటేశ్వరరావు, గాదె కృష్ణయ్య, సొసైటీ డైరెక్టర్ కల్యాణపు నరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



సామగ్రి అందజేస్తున్న యూత్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణం రైటర్ బస్తీకి చెందిన దివ్యాంగురాలు సోని, డోర్నకల్‌కు చెందిన దివ్యాంగుడు శ్రీనులకు గురువారం కొత్తగూడెంలో వివాహం జరిగింది. హాజరైన వార్డు కౌన్సిలర్ బాలిశెట్టి సత్యభామ దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా 500 మందికి పెళ్లి భోజనాలు ఏర్పాట్లు చేయించారు. సత్యభామ మాట్లాడుతూ.. దివ్యాంగులైన ఇరువురు భార్యభర్తలకు ప్రభుత్వం దళితబంధు పథకం వర్తింపజేయాలని విన్నవించారు. రైటర్‌బస్తీ గొల్లగూడెం యూత్ ఆధ్వర్యంలో దివ్యాంగ జంటకు రూ.20 వేల విలువ చేసే వాషింగ్‌మెషిన్, బీరువా, డ్రెస్సింగ్ టేబుల్ అందించి ఆదర్శంగా నిలిచారు.

అడ్డంకులను అధిగమించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: లక్ష్యం సాధించే మార్గంలో అడ్డంకులను అధిగమించి ఉన్నత స్థాయికి చేరాలని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఫేర్వెల్ వేడుకలో మాట్లాడారు. భవిష్యత్‌పై సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేష్ మాట్లాడుతూ.. రాబోయే పరీక్షలకు మెళకువలను వివరించారు. తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో విన్నర్స్‌కి, రన్నర్స్‌కి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా గవర్నర్ కూరపాటి శ్రీధర్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా డ్రెయినేజీ పనులు



నాసిరకంగా సైడ్‌కాలువ నిర్మాణం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం ఆస్పత్రి, మజీద్ వద్ద ఏరియా సివిల్ విభాగం ఆధ్వర్యంలో రూ.లక్షలు ఖర్చు చేసి కాలువ పనులు చేశారు. అయితే అవి నాసిరకంగా నిర్మించడంతో తక్కువ కాలంలోనే దెబ్బతిన్నది. ఈ విధంగా ఒకటి కాదు రెండుసార్లు పనులు చేసి కార్మికుల ధనాన్ని దుర్వినియోగం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సదరు కాంట్రాక్టరు పనులు నాసిరకంగా చేస్తున్న నేపథ్యంలో పనులను స్థానికులు అడ్డగించారు. అయితే స్పెసిఫికేషన్ నిబంధనలు చూపించడానికి సదరు కాంట్రాక్టర్ అంగీకరించకపోవటం విచారకరం. అంతే కాకుండా ఈ కాలువ పనులు ఒకరోజు ఒకపక్క, మరోరోజు మరోవైపు బ్లాకులతో కట్టి, సమపాళ్లలో మెటీరియల్‌ను కలిపి ప్లాస్టింగ్ చేయాల్సి ఉండగా, కేవలం బ్లాకులతో కట్టి పైన బండరాళ్లు వేసే ప్రయత్నం చేయటం నాలుగు రోజుల్లో అయి పోయే పనిని సుమారు 15 రోజులుగా ప్రజలకు అసౌకర్యం కల్పిస్తున్నారు. ఏరియా సివిల్ అధికారులు స్పందించి పనులు నాణ్యంగా చేయించాలని రామవరం స్థానికులు కోరుతున్నారు.

చెక్కుల పంపిణీ

జూలూరుపాడు: దళితబంధు పథకం చెక్కులను గురువారం లబ్ధిదారులకు ఎంపీడీఓ కేఎస్ వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. దళితబంధు యూనిట్ ధర రూ.10 లక్షలు కాగా మొదటి దఫాలో ఇవ్వగా మిగిలినవి చెక్కు రూపంలో ముగ్గురు లబ్ధిదారులకు ఇచ్చారు. లబ్ధిదారులు జూలూరుపాడుకు చెందిన వేల్పుల నరసింహారావుకు రూ.2 లక్షలు, పాపకొల్లుకు చెందిన గార్లపాటి పాపయ్యకు రూ.5 లక్షలు, పెద్దహరిజనవాడకు చెందిన గార్లపాటి గోపాల్ రూ.2 లక్షల విలువ గల చెక్కులను ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అందజేశారు.

తెలంగాణ ఉద్యమకారుల భిక్షాటన



మాట్లాడుతున్న రంగారావు

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్యపాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో వినూత్నంగా గురువారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటులో ప్రాణాలను లెక్కచేయక పోరాడిన ఉద్యమకారులను కేసీఆర్ అన్యాయం చేశారన్నారు. సొంత రాష్ట్రం వస్తే తమ బతుకులు బాగుపడతాయనుకున్న ఆశలు ఆడియాశలయ్యాయని పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఆరోగ్య బీమా వర్తింపజేయాలన్నారు. చంద్రగిరి సత్యనారాయణ, రషీద్, ఉబ్బెన శ్రీను పాల్గొన్నారు.

రైతులు ఆటో స్టార్టర్లు వాడొద్దు



విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: వ్యవసాయ బావులు, బోర్ల వద్ద రైతులు ఆటో స్టార్టర్లను వినియోగించవద్దని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్ సూచించారు. కొమరారం గ్రామపంచాయతీ పరిధిలో ట్రాన్స్‌కో అధికారులు గురువారం విద్యుత్ సరఫరా తనిఖీ నిర్వహించారు. గ్రామంలో మిడిల్ పోల్స్ అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించారు. తీగలు వదులుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకున్నారు. పలు కూడళ్లలో వినియోగదారులకు విద్యుత్ సంబంధిత ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి ఆటో స్టార్టర్లను తొలగించారు. గ్రామంలో దీర్ఘకాలంగా విద్యుత్ బకాయిలు ఉన్న 15 గృహాలను గుర్తించి కనెక్షను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. కొమరారం గ్రామాన్ని ట్రాన్స్‌కో దత్తత తీసుకొని విద్యుత్ సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

ఇల్లెందు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని కాంగ్రెస్ జిల్లా నాయకుడు చీమల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని 1వ వార్డులో ఇంటింటికి పాదయాత్ర నిర్వహించారు. టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తామని, రైతులకు ఉచిత కరెంటు, ఫీజు రీయింబర్స్‌మెంటు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తుందని తెలిపారు. డానియేల్, పులి సైదులు, డాక్టర్ రామచంద్ర నాయక్, సుదర్శన్‌కోరీ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోండి



కంటి వెలుగు శిబిరంలో పరిశీస్తున్న డాక్టర్ హిమబిందు

టేకులపల్లి: ప్రజలకు కంటి జబ్బుల నివారణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కంటి వెలుగు జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారిణి డాక్టర్ హిమబిందు అన్నారు. ఈ మేరకు గురువారం కోయగూడెంలో సర్పంచ్ పూనెం ఉమ, ఎంపీటీసీ జాల సంధ్య కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షల తీరు, రిజిస్ట్రేషన్, రికార్డులను పరిశీలించారు.

వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్, కంటి వెలుగు వైద్యాధికారిణి శ్రావణి, సీతమ్మ, విజయ, శకుంతల, సతీష్, ఫాతిమా, రమాకుమారి, వెంకటరమణ, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ, కంటి వెలుగు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల హక్కుల అమలులో విఫలం



ర్యాలీ నిర్వహిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

పాల్వంచ: సమాజంలో మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన హక్కులు కల్పించడంలో విఫలం చెందుతున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు వీరమల్ల ఉమ అన్నారు. గురువారం పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నటరాజ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఉమ మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగి పోతున్నాయని, విద్యార్థుల బలిదానాలు, వరకట్న వేధింపులు, మహిళలనే చులకన భావం ఉందన్నారు. మహిళలు తమ హక్కుల సాధన కోసం చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోడేటి నాగేశ్వరరావు, కె.సారంగపాణి, జ్యోతి, మలికంటి రాము, గౌని నాగేశ్వరరావు, వీరమల్ల మల్లయ్య, ఇర్ప రాజేశ్ పాల్గొన్నారు.

పేదలను దోచుకుంటున్న కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న అన్నవరపు సత్యనారాయణ

పాల్వంచ: రైతులు, కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణ, మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ల సంపద విపరీతంగా పెరిగిపోయిందన్నారు. పేదలపై నిత్యావసరాల అధిక ధరలు మోపి దోచుకుంటున్నారని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచి పేదలపై మోయలేని భారం మోపుతున్నారని ఆరోపించారు. కార్మిక చట్టాలను మార్చి హక్కులను కాలరాస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ విధాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో కార్మిక, కర్షక సంఘర్షణ ర్యాలీ నిర్వహిస్తామని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రేపాకుల శ్రీనివాస్, జి.పద్మ, కృష్ణారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష నెరవేరే వరకు ఉద్యమం



పాదయాత్రలో అరుణోదయ కళాకారులు

ఇల్లెందురూరల్: కొమరారం, బోడు నూతన మండలాలు ఏర్పాటు చేయాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి పొడుగు నర్సింహారావు అన్నారు. కొమరారం, బోడు నూతన మండలాలు, ఇల్లెందు రెవెన్యూ డివిజన్ డిమాండ్‌తో న్యూడెమోక్రసీ చేపట్టిన పాదయాత్ర గురువారం ఐదో రోజుకు చేరుకుంది. మాణిక్యారం గ్రామపంచాయతీలో చేపట్టిన పాదయాత్రకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు హాజరై సంఘీభావం ప్రకటించారు. పాదయాత్రలో పాల్గొని ఆటపాటలతో ప్రజలకు నూతన మండలాల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో పొడుగు నర్సింహారావు మాట్లాడుతూ.. అనేక చిన్న మండలాలను ప్రకటించిన ప్రభుత్వం ఇల్లెందు, బోడు విషయంలో వివక్ష చూపుతూ ప్రజల డిమాండ్‌ను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలను సంఘటితం చేసి ఉద్యమాలు ఉధృతం చేయడంలో భాగంగా పాదయాత్ర నిర్వహిస్తున్నామని వివరించారు. మాణిక్యారం సర్పంచ్ మోకాళ్ల కృష్ణ, జోగ కాంతారావు, చంద్రకళ, పద్మ, సౌజన్య, కౌసల్య, రజిత, ప్రమీల, లలిత, కల్పన పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

బి. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లెందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాంప్రసాద్ - 79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

డి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416